క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి రూ. 70 వేల విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న అధికారి

కౌతాళం: ఉరుకుంద గ్రామంలోని ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి నంద్యాలకు చెందిన మహేంద్ర నాయక్, శిరివెన్నెల కుటుంబ సభ్యులు సోమవారం రూ.70 వేలు విరాళం అందజేశారు. దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలతో సత్కరించారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అధికారులు కోరారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన



ఆర్టీసీ బస్టాండులో ప్రదర్శన చేస్తున్న సిబ్బంది

ఆదోని అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఆదోని ఇన్‌చార్జి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. వాటర్ టెండర్‌కు మైకులు బిగించి ప్రధాన రహదారి, కూడళ్లు, ఆర్టీసీ బస్టాండు, తిమ్మారెడ్డి బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు, సిబ్బంది వాటర్ ద్వారా ప్రదర్శన చేసి చూపారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను ఎలా ఆర్పివేయాలో జాగ్రత్తలపై కరపత్రాలను అందజేశారు. సిబ్బంది మహబూబ్‌బేగ్, వెంకటేష్, మోహన్, పంపాపతి, చిదంబర్‌రెడ్డి, రాజశేఖర్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



విద్యార్థి మల్లికార్జునను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కౌతాళం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వీరేసేనారెడ్డి, మహేంద్రరెడ్డి, గిరిజమ్మ, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి సోమవారం సన్మానించారు. కామవరం గ్రామానికి చెందిన రంగమ్మ ఆదోని ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీలో 470కు గాను 448 మార్కులు సాధించింది. అలాగే కోరి మల్లికార్జున 445 మార్కులు సాధించడంతో ఇద్దరిని అభినందించారు.


ఘనంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన శ్రీ వేంకటేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి మూలమూర్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో వెలిసిన శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు గిరిచార్యులు ఆధ్వర్యంలో వేకువజాము నుంచే హోమాలు, పూర్ణాహుతి, పంచామృతాభిషేకం, అభిషేకాలు, విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు గోపూజ చేశా రు. సరస్వతరత్న అవార్డు గ్రహీత సుస్వరం నాగరాజాచార్యులు భక్తులకు ఆధ్యాత్మిక విషయాలపై ప్రవచనాలను వినిపించారు. కలియుగ దైవమైన శ్రీవెంకటేశ్వరస్వామి ధర్మానికి అధిపతి అని అన్నారు. ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుందని సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి వారే చెప్పారన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



నదిచాగి వద్ద బోల్తా పడిన కారు

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామం వద్ద సోమవారం సాయంత్రం పెద్ద ప్రమాదం తప్పింది. కుంబళనూరు క్యాంపు-2కు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో ప్రయాణిస్తుండగా నదిచాగి వద్ద ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అదే సమయంలో ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో ఇద్దరూ ఎలాంటి గాయాలు లేకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికులు కారును పైకి లేపారు.

చంద్రబాబు.. కరువు కవల పిల్లలు



తారాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ప్రదీప్‌రెడ్డి



4వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు

పెద్దకడబూరు: చంద్రబాబునాయుడు.. కరువు కవల పిల్లలని, ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్ర ప్రజలు కరువుతో అల్లాడాల్సిందేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని తారాపురం గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమంతో పాటు సమృద్ధిగా వర్షాలు కురిసి మంచి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో సంక్షేమం మాట అటుంచితే వర్షాలు కూడా సరిగ్గా కురవలేదని.. ప్రజలు కరవుతో సొంత ఊర్లను వదిలి వలస వెళారన్నారు. 2014 ఎన్నికల్లో వందల సంఖలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా.. ప్రజలు సంతోషంగా ఉండాలన్నా మరోసారి జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి, రవిచంద్రారెడ్డి, ,రఘురాముడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిని మరోసారి ఆశీర్వదించండి

ఆదోని టౌన్: ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చేపట్టిందని వాటిని కొనసాగించుకునేందుకు మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కుమార్తె గౌతమిరెడ్డి, కోడళ్లు హిరణ్మయి రెడ్డి, మనోవిద్యారెడ్డి సోమవారం పట్టణంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. 4వ వార్డులో దత్తాత్రేయస్వామి గుడి ఏరియా, దండుగేరి, సదాశివపేట, పింజారివాడి ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సాయిప్రసాద్ రెడ్డిని ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఆదోనిని అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత సాయిప్రసాద్‌రెడ్డికే దక్కుతుందన్నారు. డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశారని, మండిగిరి లేఅవుట్‌లో 10,200 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారన్నారు. 5 వేల టిడ్కో ఇళ్లను నిర్మించారని వివరిస్తూ ప్రచారం చేశారు. గతంలో రూ.2100 డీడీ కట్టిన ప్రతిఒక్కరికీ పక్కా ఇళ్లు, ఇంటి స్థలం మంజూరు చేశారని గుర్తు చేశారు. అలాగే.. 36వ వార్డులో కౌన్సిలర్ నందీప్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సన్నీ, శోభాలత, మంజుల, నుగుణ, ఫరహత్‌బాను, ఫయాజ్, సునార్‌అబ్దుల్‌ఖాదర్, ఉమామహేశ్వరి, గోవిందు, ఆనంద్, ఉస్మాన్, కోటిరెడ్డి, ఉస్మాన్‌బాషా, నాగరాజ్, లాల్‌బాషా, నజీర్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమం



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ప్రతి గడపకు సంక్షేమం పథకాలు అందాయని.. మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నాయకులు అనూష రెడ్డి, గిరిజమ్మ, మహేంద్రారెడ్డి, కౌతాళం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి అన్నారు. సోమవారం కౌతాళం మండలంలోని కామవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు సాఫీగా కొనసాగాలన్నా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం.. ఈ ప్రభుత్వం మధ్య తేడాను గమనించి ఓటు వేయాలన్నారు. కామవరంతో పాటు చిరుతపల్లి, మల్లనహట్టి, కరణి, తిప్పలదొడ్డి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, సర్పంచ్ వసంత, నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, వడ్డెరాము, బీమేష్, మరేగౌడ్, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమలు స్థాపించాలి



మాట్లాడుతున్న కె.వెంకటేశులు

ఆదోని రూరల్: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాల్, వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి రామాంజనేయులు కోరారు. సోమవారం పట్టణంలోని ఎన్జీవోస్ హోంలో రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదోని ప్రాంతం పాలకుల నిర్లక్ష్యం వల్ల పూర్తిగా వెనకబడిపోయిందని, కరువు, వలసలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఎల్‌సీ కింద చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదన్నారు. ఆయా పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కోసిగి: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్ నాయుడు, జంపాపురం బసవరాజు, బండ్ల గోవిందు, బెంగి వీరేష, కోడిముక్కల గోపాల్, ఆనంద్, గ్యాంగ్ ఈరన్న కోరారు. సోమవారం కోసిగిలోని శ్రీరామ టాకీస్, ఎన్టీఆర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

నవబృందావన క్షేత్రంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు వై. బాలనాగిరెడ్డి, వై.సాయి ప్రసాద్ రెడ్డి సోమవారం కర్ణాటకలోని ఆనెగొంది నవబృందావన క్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్రంలో కొలువుతీరిన మధ్వమత పూర్వపు పీఠాధిపతుల మూల నవ బృందావనాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పద్మనాభ, జయతీర్థ బృందావనాలకు అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఇస్వీ పోలీసులు

ఆదోని రూరల్: కౌతాళం మండలం బదినేహాల్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని సెబ్ సీఐ విన్నీలత తెలిపారు. సోమవారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. లోకేష్, నరసన్న మోటార్ సైకిల్‌పై 10 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకుని మద్యం బాక్సులు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆదోని రూరల్: ఇస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద హరివాణం చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న 12 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా బాగవడి గ్రామానికి కె.చిందానంద, కర్నూలు జిల్లా హొళగుంద మండలం ఇంగళదహాల్ గ్రామానికి చెందిన బోయ నలగదుద్ది వెంకటేష్ హోండా యూనికార్న్ బైక్ (కేఏ34 ఈఎస్ 5907)పై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. 90 ఎం.ఎల్. పరిమాణం గల కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 576 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని బైక్ సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని వివరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు: ఎమ్మిగనూరు-మాలపల్లి ప్రధాన రహదారిలోని హెచ్.మురవణి సమీపంలో 4వ మైలురాయి వద్ద 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. నిందితుడు మొత్రు ఈరన్నను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మినా, కొనుగోలు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభ్యర్థుల ఖర్చు లెక్క చెప్పాల్సిందే



మాట్లాడుతున్న ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రామునాయక్

ఆలూరు రూరల్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార ఖర్చును తప్పనిసరిగా ప్రతిరోజూ నియోజకవర్గ ఎన్నికల వ్యయ అధికారికి తెలియజేయాలని ఆలూరు ఆర్ఓ రామునాయక్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ ఆఫీసర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రచారంలో ఉపయోగించే వాహనాలు, పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పత్రికలు, టీవీ చానళ్లలో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థి ప్రత్యేక ఖాతా నుంచి నగదు డ్రా చేసి ఖర్చు చూపాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి అభ్యర్థుల ఖాతా నుంచే నగదు ఖర్చు చేయాలన్నారు. ప్రచార సమయంలో అభ్యర్థి దగ్గర రూ.10 వేలకు మించి ఉండరాదని, పార్టీ తాత్కాలిక కార్యాలయాల అద్దె, టిఫిన్లు, భోజనాలు, తాగునీటి బాటిళ్ల ఖరీదు ఈసీ నిర్ధారించిన రేటుతో లెక్క కడతామని చెప్పారు. బహిరంగ సభల ఏర్పాటు ఖర్చును 24 గంటల ముందే తెలియజేయాలన్నారు. నామినేషన్ దాఖలైన నాటి నుంచి అభ్యర్థి ప్రచారంపై వీడియో చిత్రీకరణ ఉంటుందని, అభ్యర్థి మొత్తం ఖర్చు రూ.40 లక్షలకు మించరాదని సూచించారు. ఏఆర్వో చంద్రశేఖర్, టీడీలు రజనీకాంత్ రెడ్డి, గుండాల్ నాయక్, హొలహర్వి తహసీల్దార్ బ్యూలా, సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

టీడీపీలో కష్టపడే వారికి గుర్తింపు లేదు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు వైకుంఠం మల్లికార్జునచౌదరి పిలుపునిచ్చారు. ఆలూరులోని వైకుంఠం చౌదరి నివాసంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి ఎలాంటి గుర్తింపు ఉండదన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు గల్లంతయ్యేలా, వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం దక్కేలా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఆలూరు మండల కన్వీనర్ ఈరన్న ఉన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

ఆలూరు రూరల్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు అదుపు చేయవచ్చని ఆలూరు ఫైర్ అధికారి ఖాద్రి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బస్టాండ్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది మంటలను ఎలా అదుపు చేస్తారో ప్రయోగాత్మకంగా చూపించారు. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 101కు కాల్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు అందుబాటులో ఉంచరాదని, బీడీ, చుట్ట కాల్చిన వారు పడేసేముందు పూర్తిగా ఆర్పివేయాలని సూచించారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

కౌతాళం: వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సోమవారం మండల పరిధిలోని కామవరం గ్రామానికి చెందిన 19 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించారు. అలాగే బావురం సచివాలయానికి చెందిన ఇద్దరు రాజీనామాలను సమర్పించినట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు.

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు, జంపాపురం, అగసనూరు గ్రామాల్లో 45 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గంగభవానికి రాజీనామా పత్రాలను అందజేశారు. జంపాపురంలో 12 మంది, కందుకూరులో 12, దుద్ది-11, చిర్తనకల్లు-4, కోసిగి-4, సాతనూరు, అగసనూరులో ఒకరు చొప్పున రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. తమకు ఉపాధితో పాటు సేవ చేసే అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసినట్లు వెల్లడించారు. వలంటీర్లు కె.వీరేష్, పెద్దయ్య, బసవలింగప్ప, అనురాధ, వెంకట రెడ్డి, సురేష్, భీమేష్, రామలింగ, కృష్ణ, రామాంజనేయులు, మాబాషా, దొడ్డయ్య, గఫూర్, ఉసేని, శివశంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

ఆదోని టౌన్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేస్తున్నారు. నియోజకవర్గంలో 1,111 మంది గ్రామ, వార్డు వలంటీర్లు రాజీనామాలు చేశారు. రాజీనామాల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నామని వలంటీర్లు లేఖలో పేర్కొంటూ వార్డు, గ్రామ సచివాలయాల అడ్మిన్‌లకు అందజేస్తున్నారు. వారు రాజీనామా పత్రాలను ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్‌కు సిఫారసు చేయగా ఉన్నతాధికారులు ఆమోదించారు. పట్టణంలో ఇప్పటివరకు 168 మంది, మండలంలో 67 మంది రాజీనామాలు చేశారు. మొత్తం 235 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. మొత్తం 1,099 మందిలో 235 మంది రాజీనామాలు సమర్పించారు.



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

పెద్దకడబూరు: మండల పరిధిలోని మేకడోణ, నౌలేకల్లు, గంగులపాడు గ్రామాలకు చెందిన 14 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందించారు. టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు మనస్తాపం చెందిన రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. వలంటీర్లు వీరేష్, ఖైరున్నీసా, ప్రతిభ, అశోక్, బీబీ, రమేష్, యల్లమ్మ, సునిత ఉన్నారు.

పుట్టిన బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్ వేయించాలి

ఆదోని టౌన్: క్షయ నివారణ చర్యల్లో భాగంగా పుట్టిన బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్ హర్షిక తెలిపారు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌నగర్, అరుంజ్యోతినగర్, షరాఫ్‌బజార్ మాక్ సెంటర్లలో క్షయ వ్యాధిపై డాక్టర్లు గాయత్రి, సాగర్, వినోద్‌తో కలిసి అవగాహన సదస్సు సూపర్‌వైజర్ బాబురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దగ్గులో రక్తపుచారలు, ఆకలిని తగ్గించడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం వచ్చినట్లయితే క్షయవ్యాధి లక్షణాలని చెప్పారు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 18 నుంచి 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న సోమవారం తెలిపారు. రీ కౌంటింగ్‌కు రూ.260, రీవెరిఫికేషన్ కోసం ఒక్కో పేపరుకు రూ.1300 చొప్పున చెల్లించాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు చెల్లించిన వారికి మే 1 నుంచి 4వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు, 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంకాలం 5.30 గంటల పరీక్షలు ఉంటాయని వివరించారు.

దాహార్తి తీర్చండి

తుగ్గలి: మండల కేంద్రంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములుతో కలిసి పలువురు గ్రామస్తులు ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

25 మంది బైండోవర్

తుగ్గలి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పాత నేరస్తులపై పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 25 మందిని తహసీల్దార్ షర్మిల ఎదుట బైండోవర్ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పలు గ్రామాల్లోని పాత నేరస్తులు, అక్రమ మద్యం విక్రేతలను బైండోవర్ చేసినట్లు ఎస్ఐలు మల్లికార్జున, రామాంజనేయులు తెలిపారు.

బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్గా కమిటీ సిబ్బంది క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఇబ్బందులు తప్పాయి. సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ దర్గాను దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి పూజలు చేశారు. యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సర్పంచ్ తోలు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతను సోమవారం ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈవీఎంల భద్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రాత్రిబంవళ్లు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆలూరు ఎస్ఐ ఓబులేసుకు సూచించారు.



ఆలూరులో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న సీఐ బి.వెంకటేశ్వర్లు

నాటుసారా స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారు పెద్ద వంకలో నాటుసారా తయారీ స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. గ్రామానికి చెందిన రామచంద్రుడు వంకలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లగా నిందితుడు పారిపోయాడు. స్థావరం వద్ద ఉన్న 750 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

వైభవంగా వసంతోత్సవం

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాలు సోమవారం వసంతోత్సవంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామివారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి గుర్రంపై ఊరేగుతున్నట్లుగా అలంకరణ చేసి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. భక్తుల నందికోలు సేవ ఆకట్టుకుంది. ఆనవాయితీగా ఆలయంలో స్వాములకు రంగులు వేసి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. చిన్నపెద్ద తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ ఊరేగారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. సోమవారం ఆలూరు-3 సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్యారోగ్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేశారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ రవి తెలిపారు.

19న బండలాగుడు పోటీలు

చిప్పగిరి: శ్రీరామనవమి సందర్భంగా నేమకల్లు గ్రామంలో ఈ నెల 19న రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ప్రేమ్‌కుమార్ సోమవారం తెలిపారు. పోటీల్లో దేశవు ఎద్దులు మాత్రమే పాల్గొనాలన్నారు. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా దాతలు బుసినె చంద్రశేఖర్ రూ.30 వేలు, ఎంపీపీ జూటూరు హేమలత రూ.25 వేలు, కుందనగుర్తి దివాకర్ రెడ్డి రూ.22,222 నగదు బహుమతులు అందిస్తారని ఆసక్తి కలిగిన రైతులు 18వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.